సాక్షి ప్రకాశం

మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



రావణబ్రహ్మ వాహనంపై కాశీవిశ్వేశ్వరుడు

ఒంగోలు టౌన్: మహాశివరాత్రి పండగ సందర్భంగా ఒంగోలు కేశవస్వామి పేటలో కాశీవిశ్వేశ్వర స్వామిని సోమవారం రావణబ్రహ్మ వాహనం పై ఊరేగింపు నిర్వహించారు.



నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ఒంగోలు టౌన్: సుపరిపాలనా వేదిక నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. అధ్యక్షునిగా మాగులూరి నాగేశ్వరరావును ఎన్నుకున్నారు.

గరిష్టం/కనిష్టం
32 /20

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నిర్మమహేశ్వర స్వామి ఆదాయం రూ.5,65,814



పొదిలి శివాలయంలో బ్రహ్మోత్సవాలకు వచ్చిన ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

పొదిలి రూరల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా పొదిలి పార్వతీ దేవి సమేత నిర్మమహేశ్వర స్వామి తిరునాళ్లకు వివిధ రూపాల్లో రూ.5,65,814 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం కమిటీ చైర్మన్ యక్కలి శేషగిరిరావు, ఈఓ శ్రీనివాసరావు చెప్పారు. ఆదివారం రథోత్సవం ముగిసిన తరువాత రాత్రి ఆలయ కమిటీ చైర్మన్ యక్కలి శేషగిరిరావు, ఈఓ శ్రీనివాసరావు, ఆలయ పాలక మండలి సభ్యుల సమక్షంలో ఆదాయాన్ని లెక్కించారు. ఆదాయం గత ఏడాదికన్నా రూ.48 వేలు పెరిగినట్లు చెప్పారు.

రూ.4.24 లక్షల ఎర్రచందనం పట్టివేత

- ఐదుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు



ఎర్రచందనం దుంగలతో కేసు వివరాలు తెలుపుతున్న డీఎస్పీ కిశోర్‌కుమార్

బేస్తవారిపేట: అక్రమంగా అశోక్ లేల్యాండ్ వాహనంలో ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కిశోర్‌కుమార్ సోమవారం తెలిపారు. బేస్తవారిపేట పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. నెల్లూరు జిల్లా వరికుంటపాడులో ఎర్రచందనం సాగు చేస్తున్న రైతు పొలంలో చెట్లను నరికి, అదే జిల్లాలోని వలేటివారిపాలెంలో నిల్వ చేశారు. ఆదివారం చెరకుగడల లోడులో రూ.4.24 లక్షల విలువైన 24 ఎర్రచందనం దుంగలు పెట్టి రవాణా చేస్తున్నారు. పక్కా సమాచారంతో పందిళ్లపల్లె టోల్‌ప్లాజా వద్ద వాహనంలోని ఎర్రచందనం దుంగలు, నలుగురు వ్యక్తులు, ఎస్కార్ట్‌గా మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న మరొకరిని అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో కంభం సీఐ రాజేష్ కుమార్, ఎస్సై మాధవరావు పాల్గొన్నారు.

పట్టభద్రులకు ఒక నామినేషన్

- నామినేషన్ స్వీకరించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఇండిపెండెంట్ గ్రాడ్యుయేట్ అభ్యర్థి నీలం శామ్యూల్ మోసెస్

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సోమవారం ఒక నామినేషన్ దాఖలైనట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు బాపట్ల జిల్లా చీరాలకు చెందిన ఇండిపెండెంట్ అభ్యర్థి నీలం శామ్యూల్ మోసెస్ నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ నామినేషన్ పత్రాన్ని స్వీకరించారు. దీంతో ఇప్పటి వరకు మూడు నామినేషన్లు దాఖలయ్యాయని అధికారులు వెల్లడించారు. ఈ నెల 23వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉంది. దీంతో బుధ, గురు వారాల్లో ఎక్కువ మంది నామినేషన్లు వేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అలాగే ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్ సీపీ సోమవారం అభ్యర్థిని ప్రకటించింది. దీంతో ఆయన త్వరలో నామినేషన్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం.

జగనన్న ముద్దు–చంద్రబాబు వద్దే వద్దు

- రాప్తాడు నుంచి తాడేపల్లికి పాదయాత్ర

కంభం: నవరత్నాలతో ఆంధ్రప్రదేశ్‌లో కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతుంటే ఓర్వలేని ప్రతిపక్ష పార్టీ ప్రభుత్వం పై బురదజల్లుతోందని రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి యస్.సాయి కృష్ణ అన్నారు. రాష్ట్రానికి జగనన్న ముద్దు–చంద్రబాబు వద్దే వద్దు అన్న నినాదంతో సత్యసాయి జిల్లా రాప్తాడు నుంచి తాడేపల్లి వరకు చేపట్టిన పాదయాత్ర పదో రోజు కంభంలో ప్రవేశించగా స్థానిక సర్పంచ్ పల్నాటి బోడయ్య స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి జగనన్న ముద్దు చంద్రబాబు వద్దే వద్దు అన్న నినాదంతో లక్ష కరపత్రాలు ప్రచురించి ప్రజలకు పంచుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు. పదిరోజులుగా సాగుతున్న తమ పాదయాత్రకు మద్దతు పలుకుతున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

రథోత్సవం.. రమణీయం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన త్రిపురాంతకంలో త్రిపురాంతకేశ్వరస్వామి, మదనూరులోని రామలింగేశ్వరస్వామి రథోత్సవాలు సోమవారం కన్నుల పండువగా జరిగాయి. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

- 8లో..



త్రిపురాంతకంలో స్వామివారి రథోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తజన వాహిని



త్రిపురాంతకంలో ఊరేగింపుగా వస్తున్న త్రిపురాంతకేశ్వరస్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులు





కొత్తపట్నం మండలం మదనూరు గ్రామంలో రామలింగేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, (ఇన్‌సెట్లో) స్వామి వారి ఉత్సవమూర్తులు

నకిలీ ఓట్లను తొలగించేందుకు చర్యలు



వీడియో సమావేశంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఇతర అధికారులు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

ఒంగోలు అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో నిబంధనల మేరకు నకిలీ ఓట్లు, డూప్లికేట్ ఓట్లను గుర్తించి వాటిని తొలగించేలా చర్యలు తీసుకున్నట్లు జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్.. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. ప్రధాన ఎన్నికల అధికారి శాసనమండలి ఎన్నికలకు సంబంధించి కలెక్టర్‌లతో సోమవారం వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో ప్రకాశం భవనం నుంచి జేసీ పాల్గొన్నారు. జిల్లాలో చేపడుతున్న చర్యలను జేసీ వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ బృందాలకు వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా దృష్టి సారించామన్నారు. ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ శాసన మండలి ఎన్నికలకు సంబంధించి దరఖాస్తులన్నీ ఈ నెల 23వ తేదీ నాటికి క్లియర్ చేయాలన్నారు. దీనిలో డీఆర్‌ఓ ఓబులేసు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు విశ్వేశ్వరరావు, సందీప్ కుమార్, స్పెషల్ డీటీ గ్లోరియా పాల్గొన్నారు.

పోతుల సునీత హ్యాట్రిక్

- బీసీ కోటాలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం ఖరారు
- 2017, 2021లో ఎమ్మెల్సీగా విజయం
- ప్రస్తుతం పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా బాధ్యతలు

చీరాల: ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతుల సునీత ఎంపికయ్యారు. దీంతో ఆమె వరుసగా మూడోసారి ఎమ్మెల్సీ పదవిని దక్కించుకోనున్నారు. బీసీ (పద్మశాలి) సామాజికవర్గానికి చెందిన పోతుల సునీత బాపట్ల జిల్లా చీరాలలో నివాసముంటున్నారు. 2017లో సునీత ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. పదవీకాలం మరో మూడేళ్లు ఉండగానే ఆమె పదవికి రాజీనామా చేశారు. 2021 ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆమెకు ఎమ్మెల్యే కోటా కింద ఎమ్మెల్సీగా స్థానం కల్పించారు. ప్రస్తుతం 2023 మార్చితో ఆమె ఎమ్మెల్సీ గడువు పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మెల్యే కోటా నుంచి ఆమెకు ఎమ్మెల్సీ స్థానం కల్పించారు. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన పోతుల సునీతను వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా నియమించి ఆమెకు మరిన్ని బాధ్యతలు అప్పగించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన సందర్భంగా పోతుల సునీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు పెద్ద పీట వేశారన్నారు. స్థానిక సంస్థల్లోనూ బీసీలకు ప్రాధాన్యత ఇస్తూ మాటల ప్రభుత్వం కాకుండా చేతల ప్రభుత్వంగా నిరూపించారన్నారు. బీసీలకు అందించిన సామాజిక న్యాయం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ రోజు ఇంతమందికి పదవులు కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. బీసీలకు చేసిన న్యాయాన్ని అందరూ గుర్తించాలన్నారు. బీసీలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనను సీఎం చేతల్లో చూపిస్తున్నారని, అందుకు ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికే నిదర్శనమన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అఖండ మెజార్టీని కట్టబెట్టి ముఖ్యమంత్రి స్థానంలో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉంచేలా అందరూ కృషి చేయాలన్నారు.

బయోడేటా...
పేరు : పోతుల సునీత
భర్త : పోతుల సురేష్
విద్యార్హత : డిగ్రీ



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ పోతుల సునీత

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం

- తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతు తెలపండి
- అధికార పార్టీ బలపరిచిన వారైతే ఉపాధ్యాయ, నిరుద్యోగులకు ప్రయోజనం
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- జిల్లాలోని ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌లు, ఎమ్మెల్సీ అభ్యర్థులతో సమీక్ష
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆదరించాలని పిలుపు



ఎమ్మెల్సీ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకట రెడ్డి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: వైఎస్సార్‌సీపీ బలపరిచిన తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని పట్టభద్రులు, ఉపాధ్యాయులను ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం బాలినేని తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డిలతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ మార్చి 13వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. అందుకోసం మొట్టమొదటి సారిగా వైఎస్సార్ సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులను పోటీలో నిలిపిందన్నారు. అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే అటు ఉపాధ్యాయుల సమస్యలను, ఇటు పట్టభద్రుల, నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు వీలుకలుగుతుందన్నారు. మొదటి ప్రాధాన్యతా ఓటు వీరిద్దరికీ వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సేవాభావం కలిగిన అభ్యర్థులను ఎమ్మెల్సీ ఎన్నికల్లో రంగంలోకి దించారని, అందుకు గర్విస్తున్నానన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాచరణను ఇప్పటికే ప్రారంభించామని వెల్లడించారు. తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ పోటీలో ఉన్న ఇద్దరు అభ్యర్థులను గెలిపించుకురావాలని సీఎం వైఎస్ జగన్ తనపై భారం మోపారన్నారు. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌లను రంగంలోకి దించి ఘన విజయం సాధించే దిశగా ప్రణాళికలు రచించామని బాలినేని వెల్లడించారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేనివిధంగా పట్టభద్రుల ఓట్ల నమోదు భారీ స్థాయిలో చేపట్టామన్నారు. దాదాపు 3 లక్షలకు పైగా పట్టభద్రుల పేర్లను ఓటర్లుగా నమోదు చేశారని చెప్పారు. మూడు జిల్లాల్లో కలిపి 36 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు బాగా సహకరిస్తున్నారని వెల్లడించారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అంటే 1 సంఖ్యను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న పట్టభద్రులైన ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా ముందుకు సాగుతానని హామీ ఇచ్చారు. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ తనకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పోటీచేసే అవకాశం కల్పించి ప్రోత్సహించారన్నారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ పేదల ఇళ్లలో విద్యా కుసుమాలను వెలికి తీయాలన్నదే లక్ష్యంగా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను విద్యా దేవాలయాలుగా తయారు చేశారన్నారు. ఓటు వేయటానికి వెళ్లే ప్రతి పాఠశాలను చూసి ప్రజలు నివ్వెరబోతారని అన్నారు. ప్రభుత్వం నుంచి ఉపాధ్యాయులకు చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటానని భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే సమస్యల పరిష్కారం సులభంగా ఉంటుందని అన్నారు. అందుకోసం ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు అందరూ మొదటి ప్రాధాన్యతా ఓటు (1 నంబరు) వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలో కలిసి పనిచేసే అవకాశాన్ని కల్పించాలని వేడుకున్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లతో సమీక్షించిన బాలినేని

జిల్లాలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డి, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు జంకె వెంకట రెడ్డిలతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికలపై బాలినేని సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాటించాల్సిన వ్యూహాలపై అంతర్గత సమావేశంలో లోతుగా చర్చించారు. సమీక్షలో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర బాబు, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, అద్దంకి ఇన్‌చార్జ్ బాచిన కృష్ణ చైతన్య, చీరాల ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్, కొండపి ఇన్‌చార్జ్ వరికూటి అశోక్ బాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రాంతీయ భావనలకు పుట్టినిల్లు దక్షిణ భారతమే

- వైస్ చాన్సలర్ యం.అంజిరెడ్డి

ఒంగోలు టౌన్: ప్రాంతీయ భావాలు, ప్రాంతీయ ఉద్యమాలు ఎక్కువగా దక్షిణ భారత దేశంలోనే పురుడు పోసుకున్నాయని వైస్ చాన్సలర్ యం.అంజిరెడ్డి అన్నారు. ప్రాంతీయతత్వం, ప్రాంతీయ ఉద్యమాలు అనే అంశం మీద ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వైస్ చాన్సలర్ అంజిరెడ్డి ప్రాంతీయ ఉద్యమాలు రూపాంతరం చెందిన విధానాన్ని వివరించారు. శక్తి వంచన లేకుండా విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. దేశంలోనే యూనివర్శిటీకి మంచి పేరు ప్రతిష్టలు తెచ్చేందుకు అధ్యాపక బృందం తనకు పూర్తిగా సహకరించాలని కోరారు. సమకాలీన సమస్యలపై నిర్వహించే సదస్సులకు ఐసీఎస్ఎస్ఆర్ సహాయ సహకారాలను అందజేస్తుందని డైరెక్టర్ వై.రమేష్ తెలిపారు. దోపిడీ, విద్యాద్యోగాల్లో అసమానతలు ప్రాంతీయ ఉద్యమాలకు దారి తీస్తున్నాయని సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ డెవలపింగ్ సొసైటీ ఆచార్యులు ప్రియదర్శిని విజయశ్రీ స్పష్టం చేశారు. ఆంధ్ర తెలంగాణాల మధ్య వైరుధ్యాలను వివరించారు. నిమ్న సామాజికవర్గాలు తమ అభ్యున్నతి కోసం పోరాటాలు చేస్తున్నాయని చెప్పారు. పుదుచ్చేరిలో ఆచార్యులుగా పనిచేసి పదవీ విరమణ చేస్తున్న డాక్టర్ బి.రామచంద్రా రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సదస్సుకు సమన్వయకర్తగా ఆచార్య డి.వెంకటేశ్వరరెడ్డి వ్యవహరించగా స్పెషలాఫీసర్ డా.బి.కృష్ణ, ఆచార్యులు రాజా మోహన్‌రావు, కేవీఎన్ రాజు, సోమ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న వైస్ ఛాన్సలర్ అంజిరెడ్డి

రాయవరంలో రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు



విజేతలుగా నిలిచిన బాలికల టీంకు బహుమతులు అందిస్తున్న ఎంపీడీవో

- విజేతలుగా అనంతపురం, ప్రకాశం జట్లు

మార్కాపురం: మండలంలోని రాయవరం గ్రామంలో మహా శివరాత్రిని పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి బాలబాలికల రగ్బీ పోటీలు నిర్వహించారు. విజేతలకు సోమవారం ఎంపీడీవో టీ చందన బహుమతులు అందించారు. బాలికల విభాగంలో విజేతలుగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో అనంతపురం, ప్రకాశం జిల్లా జట్లు, బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నెల్లూరు, కర్నూలు, ప్రకాశం జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. కార్యక్రమంలో రగ్బీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బీ రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, హెచ్‌ఎం టీ శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ రవిప్రసాద్ పాల్గొన్నారు.



ప్రకాశం జట్టుకు బహుమతులు అందిస్తున్న ఎంపీడీవో

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.24.80 లక్షలు

సీఎస్‌పురం: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామి వారి ఆలయానికి రూ. 24,80,656 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం నారాయణస్వామి ఆలయం వద్ద మహా శివరాత్రి ఆదాయాన్ని లెక్కించారు. స్వామి వారి దర్శనం టికెట్ల అమ్మకం ద్వారా రూ.2,85,140, హుండీల ద్వారా రూ.13,07,529, స్వామి వారి లడ్డుప్రసాదం అమ్మకం ద్వారా రూ.2,76,105, స్వామి వారి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు దాతలు ఇచ్చిన విరాళాలు రూ.3,65,259, మహా ప్రాకారం నిర్మాణానికి దాతలు ఇచ్చిన విరాళాలు రూ.62,927, స్వామి వారి కళ్యాణం చదివింపుల ద్వారా రూ.18,000, ఇతర విరాళాలు రూ.1,65,696 వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు మంచికంటి మధుసూదన్ రావు, ముదుమాల నారాయణరెడ్డి, ఆలయ పూజారులు సత్యనారాయణశర్మ, ప్రసాదశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



మదనూరులో రామలింగేశ్వరస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు



త్రిపురాంతకేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు





దర్శి : రథోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో) కాశీ అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఉత్సవమూర్తులు

శంకరా.. హరహరా..

త్రిపురాంతకం/కొత్తపట్నం/దర్శి: హర నామస్మరణతో అశేష భక్త జనం శరుణుజొచ్చింది. పరమేశ్వరుడిని స్తుతిస్తూ భక్తులు ఆధ్యాత్మికానందంలో తరించారు. మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లాలోని త్రిపురాంతకం, దర్శి, మదనూరు, ఈతముక్కలలో రథోత్సవాలు కనులపండువగా సాగాయి. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు ఉత్సాహంగా రథోత్సవాల్లో పాల్గొన్నారు.

- శివనామ స్మరణతో మారుమోగిన త్రిపురాంతకం, దర్శి, మదనూరు, ఈతముక్కల
- కనుల పండువగా సాగిన రథోత్సవాలు
- దర్శిలో హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్
- రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనం
- రథాలను లాగేందుకు పోటీపడిన యువకులు, మహిళలు
- ఆకట్టుకున్న భరత నాట్యం, కోలాట ప్రదర్శనలు



దర్శి : రథం వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్



మదనూరులో పూజలు నిర్వహిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

పాహిమాం త్రిపురాంతకేశ్వరా..

త్రిపురాంతకంలో పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వర స్వామి రథోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ రంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఉత్సవమూర్తులను రథ మండపం వరకు పల్లకిలో ఊరేగింపుగా తీసుకొచ్చారు. రథ కమిటీ, ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో పండితులు రథాంగబలి, రథాంగ హోమం నిర్వహించారు. హారతులిచ్చిన అనంతరం రథాన్ని ముందుకు నడిపించారు. రథోత్సవంలో పాల్గొనేందుకు తరలివచ్చిన భక్తులకు వివిధ సామాజికవర్గాల సత్రాల వద్ద అన్నదానం చేశారు. ఉత్సవం ఏర్పాట్లను ఈఓ చెన్నకేశవరెడ్డి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ పద్మజ మల్లికార్జున్, పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, సీఐ మీసాల రాంబాబు, ఎస్సై వెంకట సైదులు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. రథోత్సవంలో ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్ పాల్, సర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, తహసీల్దార్ వి.కిరణ్, ఎంపీడీఓ మరియదాస్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

భక్త జన సంద్రంగా మదనూరు

మదనూరు రామలింగేశ్వర ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. నాలుగో రోజు సోమవారం స్వామివారి రథోత్సవాన్ని ఈఓ జి.రమణారెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు ప్రణీత్‌రెడ్డి, ఈఓ రమణారెడ్డి, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఎంపీడీఓ పి.సుజాత, గ్రామ పెద్దలు ఆళ్ల రవీంద్రరెడ్డి, బద్దేల పుల్లారెడ్డి, లింగారెడ్డి సతీష్‌రెడ్డి, బి.శంకర్‌రెడ్డి, సర్పంచ్ గంగవరపు కోటేశ్వరరావు, బద్దేల ప్రమోద్‌రెడ్డి, బద్దేల పుల్లారెడ్డి, కేశవరపు కోటిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, కాపులు రథానికి పూజలు చేశారు. వేద పండితులు హారతులిచ్చిన అనంతరం భక్తులు శివనామ స్మరణ చేస్తూ రథాన్ని ముందుకు లాగారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో మదనూరు నుంచి ఈతముక్కల వరకు జన సంద్రంగా మారింది. డీఎస్పీ ఉప్పుటూరి నాగరాజు ఆధ్వర్యంలో సీఐ రాఘవరావు, ఎస్సై కొక్కిలగడ్డ మధుసూధన్‌రావు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

నేత్ర పర్వంగా విశ్వేశ్వరుని రథోత్సవం

మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా దర్శి పట్టణంలోని కాశీ అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి రథోత్సవం నేత్ర పర్వంగా సాగింది. నూతనంగా తయారు చేయించిన రథానికి జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పూజలు నిర్వహించారు. వేద పండితుల హారతి అనంతరం రథాన్ని భక్తులు ముందుకు కదిలించారు. మహిళలు, యువత రథం లాగేందుకు ఉత్సాహం చూపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భరతనాట్యం, కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ చైర్మన్ నారపుశెట్టి శివ రథోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో 110 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



దర్శి : భరత నాట్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు



త్రిపురాంతకంలో చిన్నారుల కోలాట ప్రదర్శన

మార్కాపురం డిపో ఆదాయం రూ.53 లక్షలు

మార్కాపురం: మహా శివరాత్రిని పురస్కరించుకుని మార్కాపురం ఆర్టీసీ డిపో గత ఏడాది కంటే ఎక్కువ ఆదాయాన్ని సాధించినట్లు డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తెలిపారు. మొత్తం 90 బస్సులతో రెండు రోజులపాటు 395 ట్రిప్పులు నడపగా రూ.53,66,275 ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. 24,029 మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని తెలిపారు. గత ఏడాది 70 బస్సులు నడపగా రూ.44,16,430 ఆదాయం వచ్చిందని చెప్పారు.

ఎస్పీ గ్రీవెన్స్‌లో వృద్ధుడు మృతి

ఒంగోలు టౌన్: కుటుంబ వివాదంపై ఫిర్యాదు చేసేందుకు జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం దేచవరం గ్రామానికి చెందిన ఏరువ గోవిందరెడ్డి(55) కూతురితో కలిసి ఎస్పీ మలికా గర్గ్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. పేరు నమోదు చేసుకున్న ఆయన పక్కనే ఉన్న కుర్చీలో కుప్పకూలాడు. వెంటనే పోలీసు వాహనంలో జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గోవిందరెడ్డి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

రైలు నుంచి జారిపడి ఉపాధ్యాయుడు మృతి

టంగుటూరు: రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన వల్లూరు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. జరుగుమల్లి మండలం పాలేటిపాడు గ్రామానికి చెందిన నిడమనూరి వెంకటేశ్వర్లు(52) టంగుటూరు నుంచి రాజమండ్రికి రైల్లో ప్రయాణిస్తున్నారు. వల్లూరు గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు జరుగుమల్లి మండలం తుమాడు గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

22న జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

ఒంగోలు టౌన్: విద్యార్థుల్లో ఆవిష్కరణ నైపుణ్యాలను పెంచడంలో భాగంగా ఈనెల 22వ తేదీన ఒంగోలులోని సెయింట్ జేవియర్స్ హైస్కూల్లో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు డీఈఓ పి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన ప్రాజెక్టులన్నీ ఈ ఎగ్జిబిషన్‌లో తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రతి హైస్కూల్ స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించి 5 ఉత్తమ ప్రాజెక్టులను మండల స్థాయికి, అలాగే 38 మండలాల్లో మండల స్థాయి ఎగ్జిబిషన్లు నిర్వహించి ప్రతి మండలం నుంచి 5 ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసినట్లు వివరించారు. జిల్లా స్థాయి ఎగ్జిబిషన్‌లో 500 మంది విద్యార్థులు 190 ప్రాజెక్టులను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రతి థీమ్ నుంచి రెండు చొప్పున 10 ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు పంపిస్తామని వెల్లడించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే బాలబాలికల కోసం ప్రత్యేకంగా వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమాచారం కోసం జిల్లా సైన్స్ ఆఫీసర్ టి.రమేష్ 9666955504ను సంప్రదించాలని సూచించారు.